## 120. ఎలా జీవించాలి?

ఓ తాత్త్విక వేత్త తన శిష్యులతో ఓ అడవి మార్గంలో ప్రయాణిస్తూ ఉండగా, కొందరు కట్టెలు కొట్టేవాళ్ళు కొన్ని చెట్లని కొట్టడం గమనించాడు. అయితే వాళ్ళు వందలాది కొమ్మలతో దాదాపు వెయ్యిమందికి నీడని ఇచ్చేంత విశాలంగా విస్తరించుకుని ఉన్న ఓ పెద్ద చెట్టుని మాత్రం కొట్టక పోవడం గమనించిన ఆయన దాన్ని ఎందుకు కొట్టలేదో కనుక్కు రమ్మని ఓ శిష్యుడిని పంపాడు.

ఆ విషయం కనుక్కుని అతను తిరిగి వచ్చి గురువుకి చెప్పాడు.

"ఆ చెట్టు పనికిరాదట. దాని కొమ్మలన్నీ వంకరటింకరలు తిరిగి ఉన్నాయిట. దాని చెక్కతో ఏ వస్తువు చేయడానికీ పనికి రాదుట. కళ్ళకి హాని చేసే పొగ వస్తుంది కనక అది వంట చెరకుగా కూడా ఉపయోగించదట."

వెంటనే ఆ తాత్త్వికవేత్త తన శిష్యులతో చెప్పాడు.

"మీరంతా ఆ చెట్టులాగా జీవించాలి. మీరు ఉపయోగబడితే, కొట్టబడి ఏ ఇంట్లోనో చెక్క వస్తువులుగా అవుతారు. ఈ చెట్టులా ఎవరికీ ఉపయోగించని విధంగా ఉంటే, ఎవరూ మీ జోలికి రాక మీరు ఆధ్యాత్మికంగా బాగా ఎదిగి అనేకమందికి ఆశ్రయాన్ని ఇవ్వగలరు."

## 121. ప్రార్థన ఫలితం

ఓ ఏడేళ్ళ కుర్రాడు తన నానమ్మ ఒళ్ళో కూర్చుని ఆవిడతో పాటు దైవ ప్రార్థన చేస్తున్నాడు. అకస్మాత్తుగా కిందకి దూకి పరిగెత్తుకెళ్ళి కొద్దిసేపట్లో వచ్చి మళ్ళీ ఆవిడ ఒళ్ళో కూర్చున్నాడు.

"దైవ ప్రార్థన చేసే సమయంలో ఇతర విషయాలు ఆలోచించకూడదని చెప్పానా? ఎక్కడికి వెళ్ళావు?" చిరుకోపంగా అడిగింది నానమ్మ.